# పుత్ర శోకం

శ్రీశైలం మెల్లగా వచ్చి గదిలో ఉన్న చాప మీద ఒరిగాడు. మాసిన గడ్డం, మాసిన బట్టలు, కొంచెం పెరిగిన గడ్డంవల్ల ముఖం కర్కశంగా కనిపించినా కళ్ళల్లో దైన్యం గూడు కట్టుకొని ఉంది. శ్రీశైలం వెల్లకిలా పడుకొని ఆస్బెస్టాస్ రేకుల కప్పువైపు చూశాడు. నల్లని చీకటితెర కళ్ళ ముందు వ్యాపించింది. గట్టిగా కళ్ళు మూసుకుని బోర్లా పడుకున్నాడు. గది వెనుక ఉన్న తడికెల వంటింట్లోంచి తల్లి గొంతు వినిపించింది.

"ఏందిరా! పొద్దున్నే లేచి దబదబా ఎవలో పిలిచినట్లు బయటకురికితివి. పొద్దున పోయినో నివి గిప్పుడు ఒస్తివి... ఎక్కడికి పోతవో చెప్పవ్? ఎప్పుడొస్తవో తెల్వదు. ఇంటి పట్టున ఉండవ్. తిండి సోయి లేదు. పొద్దున గింత చాబొట్టు నోట్లో పోసుకోకుంట పోతివి. పొద్దుగూకంగ గిప్పుడు ఒస్తివి. పనిరోకు లేకపోతే లేకపాయే తిండి రోకయినా ఉండొద్దా? యాల్లకు తింటవా అంటే గదీ లేదు. పొద్దంత ఎక్కడ తిరుగుతవో ఎర్కలేదు. ఉన్నొక్కడివి గిట్లయితివని నా రంధి నాది. నాయన గూడ గదే రంధి పెట్టుకున్నడు. నాయన ఎంబడి మేస్త్రీ పనికి పొమ్మంటె పోనంటివి..."

తల్లి పుల్లమ్మ మాటలు పూర్తికాకముందే "నాకూ మేస్త్రీ పనంటే ఇష్టంలేదని చెప్తిగద' అని కసురుకున్నాడు శ్రీశైలం.

"సరే! మేస్త్రీ పని చెయ్యను సదువుకుంటనంటివి. బడికి పోతివి. సదువుల ఫేల యిన నంటివి. ఏడాది రెండేండ్ల బట్టి సదువు బంద్ జేస్తివి. దోస్తుల తోటి రోడ్ల పొంటి గిట్ల తిర్గబడితివి. ఆఖరికి ఏమైతవు సెప్పు? సప్పుడు జేయకుంట నాయనతోటి అప్పుడే మేస్త్రీ పనికిపోతే ఇప్పటికి మంచిగ పని నేర్సుకుంటుంటివి, ఇంత సంపాయిస్తుంటివి... ఇప్పటికైనా మునిగిపోయిందేమీ లేదు. నాయనతోటి పనికి పో..." అంది పుల్లమ్మ.

"నేను పోనని చెప్తిగదనే" అసహనంతో మళ్ళీ కసురుకున్నాడు శ్రీశైలం.

"పోనంటె ఎట్లర? పాడు సోపతి పట్టి తిర్గబడితివి. ఎవడెవడో ఇంటి ముందలకు రాంగనే ఆళ్ళతోటి తుర్రున మాయమైతవ్. మల్ల ఎప్పుడింటికి ఒస్తవో తెల్వదు. ఎప్పుడో ఒస్తవ్ గిట్ల పండుకుంటవ్. చెప్పు ! ఏందో నీ మనసులున్నది చెప్పు బిడ్డా!" అంది పుల్లమ్మ కాస్త గొంతు తగ్గించి.

"ఇంటికి రాంగనే భారతం మొదలుపెడ్తవ్" అన్నాడు శ్రీశైలం అంతులేని అసహనం, కోపంతో.

"మంచిగ శెప్పినా నీకు మనసుకు పట్టదు. చెడ్డగ జెప్పిన మనసుకు పట్టదు. ఏం జేయాల్నో తెలుస్తలేదు" అంది పుల్లమ్మ బాధగా.

శ్రీశైలం కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

"ఒరే శ్రీశైలం లేసి గింత తినుర. మీ నాయన ఒస్తడు. నిన్ను సూసిండంటె మండి పడ్తడు" అంది పుల్లమ్మ.

"నీ అవ్వ! ఇంటికొస్తె నీదొక పోరు" అని శ్రీశైలం గబుక్కున లేచి బయటికి వెళ్ళి పోయాడు. చలికాలం తొందరగా చీకటి పడుతుంది. శ్రీశైలం ఆ చీకట్లో మాయమయ్యాడు. ఎటు వెళ్ళిపోయాడో తెలియదు.

"నా మీద బండపడ. ఇంటికొచ్చినోన్ని బయటికి తరిమేసిన. గింత కూడయిన పెట్టకపోతి" అని కన్నీళ్ళను కొంగుతో తుడుచుకుంది పుల్లమ్మ.

భార్య పుల్లమ్మతో కాశయ్య పట్నం బతుకవచ్చి ఇరవై ఏళ్ళు దాటాయి. పుట్టినూర్లో వరుసగా నాలుగేండ్లు వానల్లేక కరువు రావడంతో కాశయ్య వ్యవసాయం విడిచిపెట్టి పుల్లమ్మతో పట్నం వలస వచ్చాడు. రెండెకరాల పొలం చెరువు కింద వుంది. కాని వర్షాల్లేక చెరువు నిండుత లేదు. కాశయ్య రెండెకరాలు పడావు పడింది. ఊర్ల కూలి చేసుకుందామన్న పనులు దొరకని పరిస్థితి. అప్పుడు పెద్ద కూతురు ఏడాదిది. పట్నంలో ఏ కూలైనా చేసుకొని బతకొచ్చు అని కుటుంబంతో సహా బస్సెక్కాడు కాశయ్య.

కాశయ్యకు మొదట్లో మేస్త్రీ పని రాదు. ఇండ్లు కట్టే దగ్గర ఇటుకలు, ఇసుక మోసేందుకు కూలీగా చేరాడు. మేస్త్రీల వద్ద చేరి సిమెంటు ఇసుక కలపడం నేర్చుకొన్నాడు.మేస్త్రీల పని చూసి ఇటుక మీద ఇటుక పెట్టి కట్టడంలో నైపుణ్యం సంపాదించాడు.

మేస్త్రీగా పని చేయడం మొదలుపెట్టాడు. అప్పటికి కాశయ్యకు మరో కూతురు ఓ కొడుకు పుట్టారు. వాళ్ళు ఎట్లా ఎట్లా పెరిగారో కాశయ్య సంపాదన కూడా ఎరిగింది. ఇద్దరు కూతుళ్ళ పెళ్ళి ఘనంగా చేశాడు. పెళ్ళిళ్ళ కోసం కొంత అప్పు చేశాడు. ఆ అప్పుల్లో ఉన్నప్పుడే కాశయ్య కొడుకు శ్రీశైలాన్ని తన చేతికింద పనికి చేరమని చెప్పాడు.

"ఆడూ సంపాదిస్తే అప్పు జెల్ది తీర్తది. గప్పుడు గీ జాగాల ఓ చిన్న ఇల్లు కట్టుకుందాం" అన్నాడు కాశయ్య పుల్లమ్మతో.

"ఆడేమో సదువుకుంటనంటున్నడు" అంది పుల్లమ్మ.

"సదువు సదివి ఏమైనా అప్సరు అయ్యేది ఉందా? శిన్నప్పుడే పనిల చేర్తె గింత పనన్న నేర్సుకుంటడు. సన్నపని చేసే మేస్త్రీలకు మంచి కూలీ ఇస్తున్నరు. నీకెరుకేనా?" భార్య నడిగాడు కాశయ్య.

"అగో ఆడు గిటు ఒస్తున్నడు. నువ్వే అన్ని అడుగు" అంది పుల్లమ్మ.

శ్రీశైలం అప్పుడు ఏడో క్లాసు. పరీక్షలు రాశాడు. పాస్ అవుతానన్న నమ్మకంతో ఉన్నాడు. శ్రీశైలం వచ్చి తల్లి పక్కన చేరాడు.

"రేపట్నించి నాతో పనికిరా" అన్నాడు కాశయ్య కొడుకు నుద్దేశించి.

శ్రీశైలం తల్లివైపు సూశాడు నువ్వే చెప్పమన్నట్లుగా.

“మీ తండ్రీ కొడుకుల వరస బాగానే ఉంది. ఆడు పనికిరాను సదువుకుంటనం టుంటే నీ బలవంతం ఏంది. ఉన్నొక్కడు ఆణ్ణి సదువుకోనియ్యరాదు” అంది పుల్లమ్మ కొడుకును సమర్థిస్తూ.

“ఏందో! మీ తల్లీ కొడుకుల ఇష్టం” అని కోపంగా బయటికి వెళ్ళిపోయాడు కాశయ్య.

“గట్ల అయ్యాల తండ్రిమాట ఇంటే ఇయ్యాల ఈడితోటి గీకష్టముండేది కాదు” అని అనుకుని పుల్లమ్మ కన్నీళ్ళు కార్చింది.

చీకటి పడ్డాక కాశయ్య ఇంటికి వచ్చాడు. ఇంట్లో కొడుకు లేకపోవడం చూసి మస్తుగ కోపం వచ్చిందతనికి.

“శ్రీశైలం ఇంటికింక రాలేదా?” అడిగాడు భార్యను కోపంగా.

“ఒచ్చిండు... గాని” నీళ్ళు నమిలింది పుల్లమ్మ.

“ఒచ్చిండు. కానీ ఏమైందీ...?” కసిరాడు కాశయ్య.

“ఎవరో దోస్తులొస్తే గిప్పుడే ఒస్తనని బయటికి పోయిండు” అంది పుల్లమ్మ. జరిగిన విషయం జ్ఞాపకమొస్తే ఆమెకు దుఃఖం ఆగడం లేదు. దుఃఖాన్నంతా దిగమింగింది భర్త ముందు.

“అది సంగతేం నాకు సమఝయిత లేదు. సదువు కుంటనంటే సరేనంటిని. ఆ సదువేందో మంచిగ సదువుకోడాయె. ఫేలయ్యె, మల్ల రెండేండ్ల నుంచి పరీచ్చలు రాస్తున్న నని అంటున్నడు. గాని ఇంకా పదిల నుంచి ఎల్లడాయె. ఆనికి శాతనైన పని చేయక గీ శాతగాని పనుల కెందుకు పోవాల్నె? నువ్వైనా ఆనికి చెప్పవు. దోస్తులతోటి తిరుగుడుకు అలవాటుపడ్డడు. నువ్వేమి పైసలిస్తున్నవో? నీ గారెమే ఆణ్ణి చెడగొడ్తున్నది” నిష్ఠూర మాడాడు కాశయ్య.

“నా దగ్గర పైసలెక్కడియి ఆనికిచ్చెటందుకు? అయిన ఆడు నువ్వు గిట్ల అంటవనె పైసలు కూడా అడుగుతలేడు” అంది పుల్లమ్మ. ఎంత ఆపుకున్నా ఆమె దుఃఖం ఆగడం లేదు. ఆమె గొంతు దుఃఖంతో నిండిపోయింది.

అది గమనించకుండానే కాశయ్య “గిప్పటికైనా గా పరీచ్చలు పరీచ్చలని తిర్గకుంట పనికిపొమ్మను” అన్నాడు కాశయ్య కోపంగా. భార్య మాట్లాడకపోయేసరికి రెండు క్షణాలాగి...

“నువ్వే జెప్పు? నా కెవలు పని నేర్పింద్రు చెప్పు? ఊరి నుంచి ఒచ్చినప్పుడు నాకే మైనా పని తెలుసా? చెప్పు? గా సాయిలన్న దోస్తి జేసి మేస్త్రీ పని నేర్చుకోలేదా? గట్ల సొంతం ఏమైనా చేసుకోవాలె? అని ఎరికుండాలెగానీ ఇంకొకరు ఎంతకని చెప్తరు” జీవన రహస్యం చెప్పినట్టు చెప్పాడు.

“ఆడు తినిపోయిండు. మల్ల ఎప్పుడొస్తడో తెల్వదు. అన్నం తిందువుగానీ రా” అబద్ధమాడింది పుల్లమ్మ భర్తతో దుఃఖం ఆపుకుంటూ...

“ఏమన్న అంటె గిట్ల మాట మారుస్తవ్... పా... అన్నం పెట్టు” అన్నాడు కాశయ్య భారంగా లేస్తూ.

శ్రీశైలం ఇంట్లోంచి బయటపడ్డాడు. కానీ ఏం చేయాలో ఎటు పోవాలో అతనికి అర్థం కాలేదు. ఈమధ్య చాలా రోజుల నుంచి అతనికి స్నేహితులతో కలవాలని వాళ్ళతో తిరగాలని, మాట్లాడాలని అనిపించడం లేదు. వాళ్ళకు, తనకూ దూరం పెరిగినట్లుగా భావిస్తున్నాడు.

తనకు చదువుకోవాలని, డిగ్రీ చెయ్యాలని, ఉద్యోగం చెయ్యాలని ఉండేది. తన తండ్రి చేసే మేస్త్రీ పని అంటే అసలే ఇష్టం లేదు. ఏడో తరగతి వరకూ బాగానే చదివాడు. ఆ తర్వాత పాఠాలు అర్థం కానట్లు అనిపించింది. ముఖ్యంగా సైన్స్, లెక్కలు తలకు ఎక్కలేదు. ట్యూషను పెట్టిచ్చుకుంటానని తల్లిని అడిగితే “నీ అక్కల పెళ్ళిళ్ళకు అప్పుల యినయి. గిప్పుడు పైసలెక్క డ్నుంచి వొస్తయిర” అంది. దాంతో తిరిగి తల్లిని గానీ, తండ్రినిగానీ ట్యూషను గురించి అడగలేదు. టెన్త్ పరీక్షలు బాగానే రాశాననుకున్నాడు. కానీ తీరా రిజల్ట్స్ చూస్తే తన నెంబరు కనిపించలేదు. ఆ తర్వాత రెండేళ్ళ నుంచి పరీక్షలు రాస్తూనేఉన్నాడు. తన జతగాళ్ళు ఇంటర్ పూర్తి చేసి డిగ్రీకి వెళ్ళారు. ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యేందుకు ఎంట్రెన్స్ పరీక్షలకు చదువుతున్నారు. తానేమో టెన్తులోనే ఉండిపోయాడు. ఇప్పుడేం చెయ్యాలో తోచడంలేదు. తన మనస్సులోని మాట ఏమిటో ఇంట్లో ఎవ్వరూ పట్టించుకోరు. నా కోరిక వాళ్ళకర్థం కాదు! వాళ్ళ పద్ధతిలో వాళ్ళు మాట్లాడతారు. దాంతో బాధనిపిస్తుంది. చికాకు కలుగుతుంది. వాళ్లక్కావలసిందే మాట్లాడ్తారు కానీ తనకేం కావాలో చూడరు. ఏదైనా ఉద్యోగం చూసుకుందామని ఎంప్లాయ్‌మెంట్ కార్డు తీసేందుకు పోతే అక్కడ ఆఫీసులో “టెన్త్ ఫెయిలయినవ్ నీకేం ఉద్యోగం దొరుకుతుంది” అని పొమ్మన్నారు.

అతని ఈసడింపు చూశాక మళ్ళీ ఆ ఆఫీసుకు పోవాలనిపించలేదు. ఇంత జరిగాక తండ్రితో మేస్త్రీ పనికి పోవాలంటే ఇష్టంగా లేదు అయినా ఆ పని మీద తనకేం మనసు లేదు. ఆలోచిస్తూ, ఆలోచిస్తూ అర్ధరాత్రి వరకూ రోడ్ల మీదే తిరిగాడు శ్రీశైలం...

శ్రీశైలానికి ఈమధ్య గడ్డం గీసుకోవాలని కూడా అనిపించడం లేదు. ఎప్పుడో ఒక రోజు స్నానం చేస్తాడు. ఏదో నీరసం అతనిలో. తిండి తినాలనిపించదు. తల్లి తిట్ల తర్వాత పెట్టే అన్నం అసలే సహించదు.

“ఇట్లాగే రోడ్ల మీద ఒంటరిగా తిరిగితే బాగుంటుంది?” అనిపించింది అతనికి.

అర్ధరాత్రి చినుకులు మొదలయ్యాయి. కాస్సేపటికి పెద్దగా వర్షం ఆరంభమైంది. శ్రీశైలం ఎదురుగా కనిపించిన బస్టాప్ షెడ్డు కిందికి పరిగెత్తాడు. బస్ షెల్టర్‌లో ఎవరూ లేరు. చీకట్లో శ్రీశైలం నిశ్చలంగా అరుగు మీద కూర్చున్నాడు. రోడ్డు మీద లైట్ల కాంతిలో వర్షం నీటికి కార్లు మిలమిలా మెరుస్తున్నాయి. వేగంగా పోతున్న కార్ల వైపు చూస్తున్నాడు శ్రీశైలం.

ఇంతలో ఒక టాటా సుమో వచ్చి బస్సుస్టాప్‌లో ఆగింది. డ్రైవర్ వెనుకున్న సీట్లో కూర్చున్నతను నిటారుగా ఉన్నాడు నల్లని సూటులో ఉన్నాడు. తల ప్రక్కకి తిప్పి శ్రీశైలం వైపు చూశాడు. ఆ చీకట్లో దూరం నుంచి కారులోకి పడే వెలుతురులో అతని కళ్ళు మిల మిల మెరిసాయి.

"పని ఇస్తాను చేస్తావా?" కారులో నుంచి గొంతు.

"ఏం పని" సందేహంగా అడిగాడు శ్రీశైలం. ఆ కారు, ఆ మనిషిని చూస్తేనే అతనికి ఆశ్చర్యమేసింది. ఆ వర్షంలో గొంతు ఎండుకపోతున్నది. డ్రైవరు వైపు చూశాడు శ్రీశైలం. డ్రైవరు ఏం విననట్లు నిశ్చలంగా ఉన్నాడు.

'లోపలికి రా' కారు వెనుక సీట్లోంచి గంభీరంగా వినిపించింది. చీకట్లోంచి శ్రీశైలం సుమో వైపు నడిచాడు. వెనుక డోరు తెరుచుకుంది. శ్రీశైలం సుమోలోకి ఎక్కి ఆ వ్యక్తి పక్కన కూర్చున్నాడు.

"ఇదో! మేమిచ్చే సంచీని చేరవేయమన్న చోటికి చేరవేయాలి. అప్పుడప్పుడు నీకీపని ఇస్తుంటాను. కావలసినంత డబ్బు ఇస్తాను. ఇది ఉద్యోగమనుకో" అన్నాడా వ్యక్తి.

"సరేనా?" అడిగాడు.

"ఊ....." మూలిగినట్లుగా అన్నాడు శ్రీశైలం.

"సరిగ్గా చెప్పు... చేస్తావా? లేదా?" కర్కశంగా ఉంది అతని గొంతు.

"చేస్తా...ను" అన్నాడు శ్రీశైలం. అతనికి భయంగా ఉంది. అయినా కావలసినంత డబ్బు ఇస్తానంటున్నాడుకాబట్టి ధైర్యంతో కూర్చున్నాడు.

"ఏ పనీ ఏ సంపాదన లేక తిరిగేకన్నా ఈ పనేదో చేస్తే బాగానే ఉంటుంది. ఇంట్లో పోరన్నా తప్పతది" అనుకున్నాడు శ్రీశైలం.

"చేస్తాను" అన్నాడు మళ్ళీ దృఢంగా.

"అదీ అట్లా ఉండాలి" ఆ వ్యక్తి కార్లో ఎక్కడి నుంచో ఒక సంచీ తీసి శ్రీశైలానికి ఇచ్చాడు. ఆ సంచీ చేరవలసిన అడ్రెసు చెప్పాడు.

"ఆ సంచీ చేరవేయగానే నీకు ముట్టవలసిన డబ్బు అందుతుంది" అన్నాడా వ్యక్తి. మెల్లగా శ్రీశైలం సంచీ తీసుకొన్నాడు. ఆ సంచీ బరువుగా వుంది. సంచీని ఒంటికి దగ్గరగా గుండెలకు అదుముకున్నాడు. గట్టిగా గొట్టాల్లా తగిలాయి.

"పిస్తోల్లా ఏంది?" అనుకున్నాడు శ్రీశైలం భయంగా. అతని ముఖం పాలిపోయింది.

"ఏం భయపడకు. నీకేం ప్రమాదం ఉండదు. వెళ్ళు!" అన్నాడా వ్యక్తి.

శ్రీశైలం సుమోలోంచి కిందికి దిగాడు సంచీతో. కారుకొండ చిలువలా మెత్తగా ముందుకు సాగింది. చేతిలో సంచీతో ముందుకు కదిలాడు శ్రీశైలం. చూసేవాళ్ళ కతడు ఏదో బజారు నుంచి సామాను సంచీతో ఇంటికి వెళుతున్నట్లుగా కనిపిస్తున్నాడు. కానీ శ్రీశైలం ఇంటికి కాక ఆ వ్యక్తి చెప్పిన అడ్రెసు వైపు గబగబా అడుగులు వేశాడు.

ఆ తర్వాత శ్రీశైలం అప్పుడప్పుడు ఇంటికి వస్తున్నాడు. ఇష్టమైతే అన్నం తింటున్నాడు లేకపోతే లేదు. అతన్ని అతని వేషాన్ని చూడగానే తల్లి ఏదో దండకం మొదలుపెడుతుంది. శ్రీశైలం నిర్లిప్తంగా చాప మీద పడుకుని ఉంటాడు. కోపం వస్తే లేచి మాట్లాడకుండా వెళ్ళిపోతాడు. శ్రీశైలం తండ్రిని కలవడం సామాన్యంగా జరగదు. తండ్రిని కలిసినప్పుడు-

"ఏం చేస్తున్నావురా?" అని అడుగుతాడు.

"కొలువు చూసుకుంటున్న" అంటాడు శ్రీశైలం.

"పదో క్లాసు పాస్ కాలేదు. నీకు కొలువెవ్వడిస్తాడురా" అంటాడు కాశయ్య.

అంతటితో వాళ్ళ సంభాషణ ముగుస్తుంది. పుల్లమ్మ కాస్సేపు "కొడుకిట్లా అయి పోయాడే అందరిలాగే ఏదో పనిలోకి పోతే బావుండుకదా" అని ఏడుస్తుంది. తల్లి ఏడుపు చూసి శ్రీశైలం చిరాకు పడ్తాడు. ఇంట్లోంచి బయటపడతాడు.

"వాడేం చేయాలనుకుంటున్నడో నాకు తెలుస్తలేదు. అందరిలెక్క దొరికిన పనేందో చేసుకుంట, పెండ్లి చేసుకుని పిల్లల్ని కని సుఖంగా ఉందామన్న ఆలోచన లేదు" అని బాధ పడుతూ పుల్లమ్మ కన్నీళ్ళు కారుస్తుంది. పుల్లమ్మ కన్నీళ్ళు చూసి కాశయ్య చలిస్తాడు.

"అదేదో పని ఎతుకులాడుకుంటున్నడంట కదా...? కానీయ్" అన్నాడు కాశయ్య.

అలా రోజులు గడుస్తున్నాయి. శ్రీశైలం ఇష్టంవచ్చినప్పుడు ఇంటికి వస్తాడు. లేకపోతే లేదు. రానురాను ఇంటికి రావడం చాలా తగ్గించేశాడు శ్రీశైలం. ఎప్పుడైనా ఇంటికి వస్తే...

"ఏందిరా ఇంటికొస్తలేవు" అని తల్లి అడిగింది ఒకరోజు.

"కొలువు జేస్తున్నా" అన్నాడు.

"అదేం కొలువురా! ఇంటికి రానంత పనేందిరా?" అడిగింది తల్లి.

శ్రీశైలం ఏం మాట్లాడలేదు. ఇంట్లోంచి బయటికి వెళ్ళిపోయాడు. అదే మాసిన గడ్డం, మాసిన బట్టలు.

అట్లా బయటికి వెళ్ళిపోయిన శ్రీశైలం కొన్ని రోజుల వరకు ఇంటికి రాలేదు. ఒక రోజు అర్ధరాత్రి ఇద్దరు పోలీసులు ఇంటికి వచ్చారు. కాశయ్య పుల్లమ్మను లేపారు.

"పోలీసు స్టేషన్‌కు రావాలి" అన్నారు.

కాశయ్య, పుల్లమ్మలకు భయమేసింది.

"ఎందుకు?" అని అడిగారు.

"పోలీస్‌స్టేషన్‌కు రండి. అక్కడో శవముంది. గుర్తు పట్టాలి" సౌమ్యంగానే సమాధానం ఇచ్చారు.

"శవమా?" భయంతో ఒణికిపోయారు కాశయ్య, పుల్లమ్మలు.

"అవును. దొంగతనంగా ఆయుధాలు చేరవేస్తున్న వ్యక్తి శవం" అన్నాడు ఒక పోలీసు.

కాశయ్య, పుల్లమ్మలు పోలీసులతో జీపులో పోలీసుస్టేషన్‌కెళ్ళారు. ఓ గదిలో

మూలపడి ఉంది శవం. మీద కప్పిన గుడ్డకంతా రక్తం. ఆ రక్తం చూసేసరికి పుల్లమ్మ స్పృహ తప్పినట్లయింది.

"ఇదిగో దగ్గరికి రండి. ఈ శవం ఎవరిదో గుర్తు పట్టండి" శవం ముఖం మీది నుంచి బట్ట తీసి పోలీసు చూపాడు.

"ఈ శవమేంది?" అని భయంతో వణికి పోయారిద్దరూ. శవం వైపు చూసీ చూడనట్టుగా చూసారు. బట్ట అడ్డుగా ఉంది. ముఖం సరిగా కన్పించలేదు.

"మమ్ముల్నెందుకు పిలిసింగ్రు" ఏమీ బోధపడనట్లుగా కాశయ్య అన్నాడు.

"దొంగతనంగా ఆయుధాలు చేరవేస్తున్న అతని శవమట ఇది?" శవమనగానే చెమటలు కారుతున్నాయి ఇద్దరికీ. నిలబడ్డ దగ్గర్నుంచి కదలలేదు.

శ్రీశైలం కాదుకదా? అన్న సందేహం వచ్చింది వాళ్ళకు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"జల్ది రండ్రి. దగ్గరికొచ్చి సూడుండ్రి" పోలీసు పిలిచాడు.

కాశయ్య, పుల్లమ్మలు శవానికి దగ్గరగా వెళ్ళారు. కరెంటు బల్బు గుడ్డిగా వెలుగుతున్నది. ఆ గుడ్డి వెలుగులో శవం ముఖం వైపు చూశారు. ముఖంపై తల వెంట్రుకలు పడ్డాయి, మట్టి అంటుకుంది. పెరిగిన గడ్డం, కళ్ళప్పగించి చూశారు. వాళ్ళ గుండెలు చెరువులయ్యాయి. కానీ కళ్ళల్లోకి చెమ్మ రానియ్యలేదు.

"ఏమో! మాకు తెల్వది ఈయనెవరో" అన్నాడు కాశయ్య. భర్త మాటతీరును గ్రహించిన పుల్లమ్మ కూడా అలాగే సమాధానమిచ్చింది.

"బాగా చూడండి. మీ కొడుకు శ్రీశైలం కాదా?" అడిగాడు.

"... కాదు. మా శ్రీశైలం గిట్లెందుకుంటడు. కాదు" అన్నారిద్దరు ఒకేసారి.

"సరే అయితే బయటికి పొండి" అన్నాడు పోలీసు.

"వాళ్ళ కొడుకు కాదంట సార్!" అరిచాడు పోలీసు లోపలున్న మిగతా పోలీసులు వినేట్లుగా.

"సరే వాళ్ళను పంపించెయ్యి" అంది ఓ గొంతు లోపల్నుంచి.

కాశయ్య, పుల్లమ్మలు ఆ చీకట్లో ఇంటివైపు నడిచారు. వాళ్ళ కాళ్ళు భారంగా పడుత్నాయి. ముఖాలు బిగుసుకుపోయి ఉన్నాయి. ఇంటికి చేరగానే పుల్లమ్మ కళ్ళు తిరిగాయి. కాశయ్య మీదికి ఒరిగిపోయింది. కాశయ్య పుల్లమ్మను ఒక చేత్తో చుట్టేసి దగ్గరగా పట్టుకున్నాడు. పుల్లమ్మ గొల్లున ఏడ్చింది.

"ఏడ్వకు. మన రాత గిట్లున్నది. ఏం జేస్తం. ఎవర్నేమంటం..." తన చెట్టంత కొడుకు శ్రీశైలం మొఖం కళ్ళల్లో మెదలగా అన్నాడు కాశయ్య. వారి పుత్రశోకానికి హద్దులు లేకుండాపోయాయి.

- ఆదివారం ఆంధ్రప్రభ, 11 జూన్ 2000